క్లుప్తంగా

ఘనంగా మురుగులమ్మ తీర్థం



అంబాజీపేట: ఇరుసుమండలో వేంచేసిన మురుగులమ్మ అమ్మవారి తీర్థాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామ ఆడపడుచులు చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం రాత్రి అమ్మవారి జాతర కన్నుల పండువగా జరిగింది. జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి.

కత్తిమండలో ధర్నా



కత్తిమండలో ధర్నా చేస్తున్న ప్రజలు

మలికిపురం: కత్తిమండలో ఒక చర్చి నిర్మాణంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో స్థానిక గ్రామ పంచాయతీ వద్ద హిందూ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. పెద్ద ఎత్తున ప్రజలు రావడంతో ఉద్రిక్తత నెలకొంది. మలికిపురం ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు చేరుకుని చర్చలు జరిపారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరిద్దామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

అంగన్వాడీ కేంద్రాలకు ఫ్రిజ్‌ల బహూకరణ



గుమ్మిలేరులో అంగన్‌వాడీ కేంద్రానికి రెఫ్రిజిరేటర్లను అందజేసిన సర్పంచ్ రాంబాబు తదితరులు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాలకు రెఫ్రిజిరేటర్ల బహుకరణ జరిగింది. గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు తన సొంత నిధులు రూ.40 వేలతో కొనుగోలు చేసి గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అందిస్తున్న పాలు, గుడ్లు, ఇతర సామగ్రిని భద్రపరచుకునేందుకు వీలుగా ఈ ఫ్రిజ్‌లు దోహదపడతాయని బహూకరించినట్లు సర్పంచ్ రాంబాబు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అనునిత్యం సహాయ సహకారాలు అందిస్తున్న సర్పంచ్ రాంబాబుకు అంగన్‌వాడీ కార్యకర్తలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.అరుంధతి, ఏఎన్ఎం వరలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర బ్రాహ్మణ సమాఖ్య కార్యదర్శిగా భాగవతుల



కొత్తపేట: రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కార్యదర్శిగా ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవస్వామివారి దేవస్థానం ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి నియమితులయ్యారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం ఏలూరు అంబికా ప్లావర్స్‌లో నిర్వహించారు. నూతన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొనూరు సతీష్ శర్మ, హెచ్‌కే మనోహర్, కార్యవర్గ సభ్యులతో పాటు కార్యదర్శిగా వెంకటరమణమూర్తి పదవీ ప్రమాణం చేశారు. ఆయనను రాష్ట్ర సమాఖ్య తరపున అభినందించి మెమెంటో అందజేశారు. భాగవతుల నియామకంపై ర్యాలి దేవస్థానం సిబ్బంది, బ్రాహ్మణ నాయకులు జగదీశ్వరప్రసాద్, ఎం.వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు సాయం



ఉయ్యూరువారి మెరకలో బాధితురాలికి సాయం చేస్తున్న అన్నపూర్ణ

సఖినేటిపల్లి: మండలంలోని ఉయ్యూరువారి మెరక గ్రామ శివారు గుర్రంవారి గ్రూపులో అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ గుర్రం అరుణకు వైద్య ఖర్చులకు ఖతార్ వైఎస్సార్ సీపీ కన్వీనర్ దొండపాటి శశికిరణ్ రూ.10 వేల ఆర్థిక సాయం మంగళవారం చేశారు. ఈ మేరకు శశికిరణ్ పంపిన పై మొత్తాన్ని శశికిరణ్ తల్లి, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ చేతుల మీదుగా బాధితురాలికి అందజేశారు. దొండపాటి శ్రీనివాస్, డి.పూర్ణప్రకాష్, కందికట్ల మహేష్, నల్లి రాజశేఖర్, నేతల ప్రకాష్, కె.శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

19న మోటార్‌సైకిళ్ల వేలం

రాజోలు: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ఐదు మోటార్ సైకిళ్లకు ఈ నెల 19న వేలం నిర్వహిస్తామని రాజోలు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కేవీ బాబ్జి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19న జరిగే వేలంలో పాల్గొనేవారు రూ.5 వేల ధరావత్తు సొమ్ము చెల్లించాలన్నారు. వివరాలకు 8374403689 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

కోతలు మరింత జాప్యం!

- సిద్ధంగా ఉన్న వరికోత యంత్రాలు
- క్లస్టర్‌లో వరిధిలో 54.8 వేల ఎకరాల సాగు
- పెరిగిన కూలీ ధరలతో రైతుల ఇక్కట్లు
- అనుకూలించని వాతావరణం



గుమ్మిలేరులో వరికోత యంత్రంతో కోస్తున్న పంట



చింతలూరులో ధాన్యాన్ని బరకాలతో కప్పి ఉంచిన రైతులు

ఆలమూరు: వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల వల్ల వరికోతలు మరింత జాప్యమయ్యే సూచనలు కన్పిస్తున్నాయి. వాతావరణ ప్రభావంతో గత రెండు రోజులుగా అక్కడక్కడ కురిసిన భారీ వర్షాలకు తోడు ఆకాశం మేఘావృతంగా ఉండటంతో రైతులు వరికోతలను వాయిదా వేసుకుంటున్నారు. క్లస్టర్ పరిధిలోని పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో రబీ సీజన్‌కు సంబంధించి 54.8 ఎకరాల వరిసాగు చేపట్టారు. అందులో వ్యవసాయశాఖ సూచనల మేరకు సాగు చేసిన కొత్త వరి వంగడం పీఆర్-126, ఎంటీయూ 1121 కోత తుది దశకు చేరుకున్నాయి. గత వారం రోజుల నుంచి ఆ విత్తనాన్ని సాగు చేసిన రైతులు వరికోత యంత్రాల సాయంతో పంటను మసూళ్లు చేసుకుంటున్నారు. అయితే తేమశాతం తగ్గించుకునేందుకు రైతులు ఆరబెట్టుకున్న ధాన్యంపై వాతావరణం ప్రభావం తీవ్రంగా పడింది. ఇటీవల అకస్మాత్తుగా కురిసిన వర్షాల వల్ల కొంతమంది రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం వర్షార్పణం అయ్యింది. దీంతో పంట కోత దశకు వచ్చినా వాతావరణం అంత అనుకూలంగా లేకపోవడంతో మరో నాలుగు రోజుల పాటు వాయిదా వేసుకునే పరిస్థితి తలెత్తింది. అయితే ఎంటీయూ 3626 (బొండాలు) రకం సాగు ఎక్కువ రోజులు పట్టడంతో ఈ నెలాఖరు నాటికి మాత్రమే కోత దశకు రానుంది. దీంతో ఆ విత్తనాన్ని సాగు చేసిన రైతులకు ప్రస్తుతం ఏ విధమైన సమస్యలు ఉత్పన్నం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

వరి కోత యంత్రాలకు డిమాండ్

వాతావరణ పరిస్థితుల ప్రభావం దృష్ట్యా క్లస్టర్ పరిధిలో సాగు చేసిన వరిపంట అంతా ఒకేసారి కోత దశకు వచ్చే అవకాశం ఉండటంతో వరికోత యంత్రాలకు భారీ డిమాండ్ ఏర్పడింది. రబీ సీజన్‌లో ఎక్కువగా సుమారు 80 శాతం మేర రైతులు వరికోత యంత్రాల ద్వారానే మసూళ్లు చేయడం ఆనవాయితీ. అయితే ఇటీవల పలుమార్లు కురిసిన భారీ వర్షాల వల్ల అనేక మండలాల్లో వరిచేలు చిత్తడిగా మారి వరికోత యంత్రాలతో కోసే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో పలు ప్రాంతాల్లోని రైతులు వరికోతలకు కూలీలపైనే ఆధారపడవలసిన పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా ఎకరా భూమిలో కోసేందుకు ఆరుగురు కూలీలు అవసరం కాగా చిత్తడి భూమిలో కోత కోసేందుకు తొమ్మిది కూలీల అవసరం కావడంతో రైతులపై పెనుభారం పడుతుంది.

పెట్టుబడిపై తీవ్ర ప్రభావం

వరిసాగు చేపట్టిన రైతులకు పెట్టుబడి తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. వరికోత యంత్రం ద్వారా మసూళ్లు చేసేందుకు గంటకు రూ.3000 నుంచి రూ.3200 వరకూ వసూలు చేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల వరికోత యంత్రాలు పొలాల్లోకి దిగి కోసే అవకాశం లేకపోవడంతో ఆ భూమి రైతులు కూలీలపైనే ఆధారపడుతున్నారు. దీంతో కూలీల ధరకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. మగ కూలీకి రూ.1000. ఆడకూలీకి రూ.700 వరకూ చెల్లించవలసిన పరిస్థితి రావడంతో రైతులు తీవ్రమైన ఆర్థిక ఒడిదొడుకులకు లోనవుతున్నారు.

దిగుబడి ఆశాజనకంగా ఉన్నా..

రబీ సీజన్‌లో వరిపంట ఎకరాకు 40 నుంచి 50 బస్తాల దిగుబడి వస్తున్న తరుణంలో రైతులకు ఆశాజనకంగా ఉన్న పండించిన పంటను సక్రమంగా విక్రయించుకునేందుకు అవసరమైన రవాణా సదుపాయాలను ప్రభుత్వం కల్పించలేక పోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. దీనివల్ల దళారుల ప్రమేయంతో పండించిన ధాన్యాన్ని విక్రయించుకుంటే సరైన గిట్టుబాటు ధర అందదేమోనని రైతుల్లో ఆందోళన నెలకొంది. రైతులే తమ పంటను తరలించుకునేందుకు వాహనాలను ఏర్పాటు చేసుకోవాలంటూ అధికారులు చెబుతున్నారని తెలుస్తోంది. దీంతో చిన్న, సన్నకారు రైతులు పండించిన పంటను విక్రయించుకునేందుకు దళారులను ఆశ్రయించి సరైన మద్దతు ధర పొందలేక తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడింది.

రైతులకు వెన్నుదన్నుగా వ్యవసాయశాఖ



రబీ సీజన్‌లో పండించిన పంటను సరైన గిట్టుబాటు ధర పొందేందుకు వీలుగా రైతులకు ఎల్లప్పుడు వ్యవసాయశాఖ వెన్నుదన్నుగా ఉంటుంది. ధాన్యం విక్రయాల్లో ఏ విధమైన అవాంతరాలు ఏర్పడినా సత్వరమే క్షేత్ర వ్యవసాయ సహాయకుల ద్వారా వ్యవసాయశాఖ దృష్టికి తీసుకురావాలి. అలాగే రైతుల మద్దతు ధర కోసం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

– ఎస్.లక్ష్మీలావణ్య, ఏవో, ఆలమూరు

ఆదర్శనీయుడు అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు

అంబాజీపేట: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్ని వర్గాల వారికీ ఆదర్శనీయుడని జెడ్పీటీసీ, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. నందంపూడిలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని మంగళవారం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ అంబేడ్కర్ సిద్ధాంతాలను ఆచరించడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, యువజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

18న హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

రాజోలు: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా హ్యాండ్‌బాల్ పురుష, మహిళా జట్లను ఈ నెల 18న ఎంపిక చేయనున్నట్టు సెలక్షన్ కమిటీ చైర్మన్ జె.గోపాలకృష్ణ, అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణ్ మంగళవారం తెలిపారు. రాజోలు బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్, రెండు పాస్‌పోర్టు ఫొటోలు తీసుకురావాలన్నారు. వివరాలకు 9491575616, 9989705222 నంబర్లకు సంప్రదించాలన్నారు.

నవ ధాన్యాల సాగుపై అవగాహన



సదస్సులో పాల్గొన్న రైతులు, వ్యవసాయ సిబ్బంది



ఈదరాడలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ ర్యాలీ

మలికిపురం: మండలంలోని ఇరుసుమండ గ్రామ పంచాయతీలో ప్రకృతి వ్యవసాయ అవగాహన ర్యాలీ నవధాన్యాల సాగుపై చర్చా కార్యక్రమం జరిగింది. సర్పంచ్ వలవల అమ్మాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామంలోని రైతులను గ్రామ సంఘం ద్వారా ధ్రువీకరించుట కొరకు ఈ కార్యక్రమంలో చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ అమ్మాజీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఉపయోగాల గూర్చి రైతులందరూ తెలుసుకుని ప్రకృతి వ్యవసాయ విధానం తప్పక ఆచరించాలని దీనివల్ల భూమి సారవంతం పెరిగి దిగుబడి ఎక్కువ వస్తుందని అన్నారు. ప్రజలు ఈ ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చని నవధాన్యాల సాగు వరికోతలకు ముందు తమ పొలాల్లో 31 రకాలు విత్తనాలు చల్లుకొని భూసారాన్ని పెంచుకొని రసాయనాలు, పురుగుమందుల వాడకం తగ్గించుకుని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులని సన్మానించారు. ఉప సర్పంచ్ సూరిమేను శ్రీనివాసరావు, వార్డ్ మెంబర్ రమేష్, సిరిగినీడి లక్ష్మీవీరబాబు, కాత్రు రాజారావు, జనసేన గ్రామ శాఖ నందుల రమేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాస్టర్ ట్రైనర్ పి.జోసఫ్ రాజు, యూనిట్ ఇంచార్జ్ చిట్టి స్వరాజ్, మట్ట శ్రీనివాసు, ఐసీఆర్పీలు, రైతులు, వీవోఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే శ్రేయస్కరం

మామిడికుదురు: ప్రకృతి వ్యవసాయమే భూమికి శ్రేయస్కరమని సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి తెలిపారు. ఈదరాడలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై గ్రామసభ, అవగాహన సదస్సు జరిగాయి. 30 రకాల విత్తనాలను ప్రతి రైతు చల్లుకుని, దాని ద్వారా వచ్చే మంచి ఫలితాలను పొందాలని సర్పంచ్ సూచించారు. ఈ విత్తనాలను చల్లుకోవడం వల్ల భూసారం పెరుగుతుందని, భూమి గుల్లబారి భూములు సారవంతమవుతాయన్నారు. భూమిలో ఉండే బ్యాక్టీరియా సజీవంగా ఉండి భూమి లోపల సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని సర్పంచ్ పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంతోనే భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషినల్ డీపీఎం కె.సత్యనారాయణ, కుసుమ శ్రీధర్, రైతులు యెరుబండి లక్ష్మయ్య, యెరుబండి శ్రీను, కుడుపూడి జానకి, చెల్లుబోయిన రాధ, కుసుమ పద్మ, గోగి లెనిన్‌రావు, సచివాలయ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న జగ్గిరెడ్డి



వాడపల్లిలో జగ్గిరెడ్డికి వేదాశీర్వచనాలు అందజేస్తున్న పండితులు

కొత్తపేట: వైఎస్సార్ సీపీ జిల్లా శాఖ నూతన అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ముందుగా వాడపల్లి ముఖద్వారంలో జగ్గిరెడ్డికి ఆత్రేయపురం మండల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు, సిబ్బంది స్వాగతించారు. దర్శనానంతరం వేదాశీర్వచన మండపంలో జగ్గిరెడ్డిని వేదపండితులు, అర్చకులు వేదమంత్రోచ్చారణ నడుమ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. జగ్గిరెడ్డి వెంట ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బోనం సాయిబాబు తదితరులు ఉన్నారు.

నూకాంబిక ఆలయంలో జగ్గిరెడ్డి ప్రత్యేక పూజలు

ఆలమూరు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులై తొలిసారిగా మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చింతలూరు విచ్చేశారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన కాగడాలు వెలగించి ఆలయ అర్చకుల ఆశీర్వచనాలు అందుకున్నారు. తొలుత వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, నామాల శ్రీనివాసు ఆధ్వర్యంలో జగ్గిరెడ్డికి ఘన స్వాగతం లభించింది. స్థానిక మెయిన్‌రోడ్డు నుంచి బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపుగా జగ్గిరెడ్డిని ఆలయానికి తీసుకువెళ్లారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, సర్పంచ్ మార్గాని కరుణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మండల సమావేశం బహిష్కరిస్తున్నాం



తమ్మన శ్రీనివాసు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన సర్పంచ్‌లు బుధవారం జరగబోయే మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు చెముడులంక సర్పంచ్, ఆ పార్టీ సర్పంచ్‌ల సమాఖ్య ప్రతినిధి తమ్మన శ్రీనివాసు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఏ విధమైన పదవులు లేని కొంత మంది అధికార పార్టీ నాయకులు మండల సమావేశానికి వచ్చి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రజా ప్రతినిధులను అవమాన పర్చుతున్నందుకు నిరసనగా మండలంలోని 13 గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు హాజరు కావడం లేదన్నారు.

సమాజాన్ని ప్రభావితం చేసేవే రచనలు



మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వనితాపురుష శతకములు పుస్తకావిష్కరణ చేస్తున్న వైద్యులు

సఖినేటిపల్లి: రచనలు అంటే అక్షరాల కలయిక మాత్రమే కాదని, సమాజాన్ని ప్రభావితం చేసే శక్తివంతమైన సాధనం రచనలని ప్రముఖ కార్డియాలజిస్ట్ కేసీఎంఎల్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మోరి జాన సుబ్బమ్మ మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1986 పదో తరగతి విద్యార్థులు, వారి మిత్ర బృందం సహకారంతో ప్రముఖ సర్జన్ జాన వీరభద్రప్రసాద్ ఆలోచన విధానంతో మాజీ సర్పంచ్ జాన సత్యనారాయణ విజయలక్ష్మి జ్ఞాపకార్థం బహూరూప వినియోగం నిమిత్తం నిర్మించిన ఓపెన్ ఆడిటోరియంను మరో మాజీ సర్పంచ్ జాన శంకరరావు(బాబ్జీ) ప్రారంభించారు. అలాగే ప్రముఖ తెలుగు పండిట్, కవి, కామవరపు మల్లికార్జునరావు (గౌరీమల్లిక్) రచించిన వనితాపురుష శతకములు(ద్యుతి) పుస్తకాన్ని వైద్యులు శ్రీనివాస్, వీరభద్రప్రసాద్ ఆవిష్కరించారు. గౌరీ మల్లిక్‌ను వైద్యులు సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, మల్లిక్ మాస్టారు తన రచనల ద్వారా లోతైన దృక్పథంతో మరింత విజ్ఞానాన్ని సమాజానికి అందిస్తున్నారని ప్రశంసించారు. అనంతరం వైద్యులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. సర్పంచ్ పసలపూడి లక్ష్మీ పద్మమంగతాయారు, ఎంపీటీసీ జాన లక్ష్మీ దుర్గ సూర్యావతి, ఎస్ఎంసీ చైర్మన్ గుబ్బల శ్రీలక్ష్మి, ఎంఈఓ-2 మద్దాలి వెంకటేశ్వరరావు, హెచ్ఎం ఎస్.శ్రీధర్ కృష్ణ, పూర్వ విద్యార్థులు, వారి మిత్రబృందం సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష గోవింద నామార్చన చేస్తున్న మహిళలు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు గ్రామంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఆలయ ధర్మకర్త గణేశుల వెంకటేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో సౌభాగ్య వ్రతం నిర్వహించారు. శ్రీవారి ఉత్సవ విగ్రహాలను అభిషేకించారు. స్వామికి చక్రస్నానం నిర్వహించారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ 41 గ్రామాలకు చెందిన 1000 మంది మహిళలతో లక్షసార్లు గోవింద నామార్చన, 108 గోవింద నామాలను సంకీర్తన చేశారు. భజన గురువు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యకమం నిర్వహించారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మామిడికుదురు: నగరం, మగటపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో 17వ తేదీ గురువారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు మంగళవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. ట్రీ కటింగ్, సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల నిర్వహణలో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. నగరం సబ్ స్టేషన్ పరిధిలోని పాశర్లపూడి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, మామిడికుదురు, నగరం, మొగలికుదురు, పెదపట్నం, అప్పనపల్లి గ్రామాలతో పాటు రాజోలు మండలం తాటిపాక గ్రామాలకు విద్యుత్ నిలిపి వేస్తామన్నారు. మగటపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గోగన్నమఠం, మగటపల్లి, కొమరాడ, ఈదరాడ, ఆదుర్రు, లూటుకుర్రు, మాకనపాలెం గ్రామాలకు సరఫరా నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైభవంగా రావులమ్మ తీర్థం



రావులమ్మని దర్శించుకుంటున్న భక్తులు

అయినవిల్లి: గ్రామదేవతగా పూజలందుకుంటున్న రావులమ్మవారి తీర్థ మహోత్సవాలు మంగళవారం ఘనంగా జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి కానుకలు, మొక్కులు చెల్లించారు. అమ్మవారికి చలివిడి, వడపప్పు, బెల్లం పానకం నైవేద్యంగా చెల్లించారు. అమ్మవారికి గ్రామోత్సవం జరిపారు.

యువతిని బ్లాక్ మెయిల్ చేస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆలమూరు: ఒక యువతిని ప్రేమ పేరిట వంచించి బ్లాక్ మెయిల్ చేస్తున్న పైడిపోగు హరీష్‌ను ఆలమూరు పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్సై ఎం.అశోక్ కథనం ప్రకారం మండలంలోని చెముడులంకకు చెందిన ఒక యువతికి సుమారు మూడేళ్ల క్రితం సోషల్ మీడియా (స్నాప్ యాప్) ద్వారా కర్నూలు జిల్లా కల్లూరు మండలంలోని తటకనాపల్లికి చెందిన హరీష్ పరిచయమయ్యాడు. అది ప్రేమగా మారి శృతి మించి నగ్నంగా వీడియో కాల్స్‌ను మాట్లాడుకునే స్థాయికి చేరింది. యువతి నగ్నంగా వీడియో కాల్ మాట్లాడుతున్న సమయంలో స్క్రీన్ షాట్స్ తీసి ఆ హరీష్ భద్రపర్చుకున్నాడు. కొద్దిరోజులుగా నిందితుడు తాను అడిగినంత సొమ్ము ఇవ్వకుంటే ఆ స్క్రీన్ షాట్స్ సోషల్ మీడియాలో పోస్టు చేస్తానంటూ బెదిరింపులకు దిగాడు. అయితే ఆ యువతి తనకు అంత స్థోమత లేదని బతిమాలినా నిందితుడు హరీష్ వినిపించుకోలేదు. ఇటీవల ఆ యువతి పేరిట మూడు ఇన్‌స్టాగాం ఖాతాలను ప్రారంభించి ఆ నగ్న ఫొటోలను పోస్టు చేశాడు. దీంతో ఆ యువతి తన కుటుంబసభ్యుల సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్ కేసును నమోదు దర్యాప్తు చేశారు. నిందితుడు హరీష్‌ను అదుపులోకి తీసుకుని మంగళవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు.

నేడు మండల సమావేశం

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీఓ ఎ.రాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మండలాల్లోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, నిధులు మంజూరు, శాఖల వారీగా పురోగతి వివరాలు, వేసవిలో తీసుకోవలసిన చర్యలపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

60 రుణయూనిట్ల మంజూరు

పి.గన్నవరం: ఎస్సీ కార్పొరేషన్ పథకం కింద మండలానికి 60 రుణ యూనిట్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ కె.విజయప్రసాద్ తెలిపారు. ఈ కార్పొరేషన్ కింద రుణాలు పొందేందుకు అర్హత గల అభ్యర్థులు వచ్చే నెల 11 నుంచి మే 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. రూ.2.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ రాయితీపై రుణాలు ఇవ్వనున్నట్టు ఆయన వివరించారు.

ఈదురుగాలులతో వర్షం

అయినవిల్లి: అల్పపీడన ద్రోణి కారణంగా మండలంలో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. ఈ అకాల వర్షంతో రైతుల గుండెల్లో గుబులు పట్టుకుంది. పలుచోట్ల వరిచేలు కోతలు పూర్తయ్యాయి. కళ్లాల్లో ధాన్యం ఆరబెటాటరు. అకాల వర్షంతో తాము పూర్తిగా దెబ్బతిన్నామని రైతులు వాపోతున్నారు. ఇటుక బట్టీల యజమానులు ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రత నుంచి ప్రజలు మాత్రం కొంత ఉపశమనం పొందారు.

రెండు లారీలు సీజ్



అక్రమంగా మట్టి, ఇసుక తరలిస్తున్న లారీలు సీజ్ చేసిన అధికారులు

పి.గన్నవరం: ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా మట్టి, ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్ లారీలను మైన్స్ అధికారులు ఊడిమూడి గ్రామం వద్ద మంగళవారం సీజ్ చేశారు. ఊడిమూడిలంక నుంచి వస్తున్న మట్టి లారీని, రావులపాలెం వైపు నుంచి పి.గన్నవరం వైపు వస్తున్న ఇసుక లారీని మైన్స్ అధికారులు తణిఖీ చేశారు. వాటికి ఎటువంటి బిల్లులు లేకపోవడంతో సీజ్ తమకు అప్పగించినట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు.

ఆరు వాహనాల సీజ్

ఆలమూరు: నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మట్టిని, ఇసుకను తరలిస్తున్న ఆరు లారీలను సీజ్ చేశారు. కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా మైన్స్ ఏడీ ఎల్.వంశీధరరెడ్డి నేతృత్వంలో అధికారుల బృందం మంగళవారం జొన్నాడ ర్యాంపును తనిఖీ చేసింది. ఆ సమయంలో ఇసుకలో కూరుకుపోయిన లారీని గుర్తించి అక్రమ రవాణా చేస్తున్నట్లు నిర్ధారించి అక్కడికక్కడే సీజ్ చేశారు. అనుమతులు లేకుండా ఏటిగట్టు మీద వెళుతున్న ఐదు మట్టి లారీలను కూడా సీజ్ చేసి తహసీల్దార్ కెజె ప్రకాష్‌బాబుకు అప్పగించారు. ఈ ఆరువాహనాలను మైన్స్‌శాఖకు అపరాధ రుసుం చెల్లించిన తరువాత విడుదల చేయాలని ఆర్డీఓ శ్రీకర్ ఆదేశించారు. సర్వేయర్ ప్రభావతి, ఆర్ఐ రావాయమ్మ, వీఆర్ఓలు చాపల రవి, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రతి నెలా రెండు కుటుంబాలకు సాయం



అంతర్వేది దేవస్థానంలో ఒక కుటుంబానికి సాయం చేస్తున్న సత్యకిరణ్ ప్రసాద్

సఖినేటిపల్లి: నిరుపేద కుటుంబాలను ఆదుకునే రీతిలో ప్రతి నెలా రెండు కుటుంబాలకు తగిన సాయం అందజేయనున్నట్టు నల్లా విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్టు కన్వీనర్ నల్లా సత్యకిరణ్ ప్రసాద్ అన్నారు. మంగళవారం అంతర్వేది దేవస్థానంలో ఈ మేరకు రెండు పేద కుటుంబాలకు నెలకు సరిపడా బియ్యం, నిత్యావసరాలను ఆయన పంపిణీ చేశారు. స్థానిక లక్ష్మీనరసింహ యువత ప్రోద్బలంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు సత్యకిరణ్ ప్రసాద్ చెప్పారు. ఎంపీటీసీ బైరా నాగరాజు, శ్రీలక్ష్మీ నరసింహ యువత పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా వినోద్

అంబాజీపేట: మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా దొమ్మేటి వినోద్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఆదేశాలతో డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఉత్తర్వులను విడుదల చేసినట్లు వినోద్‌కుమార్ తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను అందరి సహకారంతో పూర్తి చేస్తానని ఆయన తెలిపారు.